## బాలానగర్‌లో విషాదం: ఏడాది గడిచినా మేస్త్రి దుర్గారావు ఆచూకీ మిస్టరీ



**బాలానగర్ మే18 ( పీపుల్స్ న్యూస్)**బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మేస్త్రి అదృశ్యమైన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి ఆచూకీ ఏడాది గడిచినా లభించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంట దుర్గారావు (30) పంచశీల కాలనీ, బాలానగర్‌లో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటూ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. గత ఏడాది ఏప్రిల్ 23, 2025 ఉదయం సుమారు 9:30 గంటలకు పనికి వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరిన దుర్గారావు తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఇంటిని వదిలి వెళ్లే సమయంలో తన మొబైల్ ఫోన్‌ను ఇంట్లోనే ఉంచి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం పోలీసులు ఫోన్‌ను పరిశీలించగా అందులో ఒక వీడియో లభ్యమైంది. ఆ వీడియోలో అప్పులు, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల కారణంగా తీవ్ర మనోవేదనకు గురై ఇంటిని వదిలి వెళ్తున్నట్లు దుర్గారావు పేర్కొన్నాడు. దుర్గారావు భార్య గంట సత్యరాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలానగర్ సీఐ నర్సింహా రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు ఏడాది కాలంగా వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టినా ఇప్పటివరకు దుర్గారావు ఆచూకీ లభించలేదు. భర్త కోసం ఏడాదిగా ఎదురుచూస్తున్న భార్య, చిన్నారులు కన్నీరుమున్నీరవుతున్నారు. దుర్గారావు గురించి ఎలాంటి సమాచారం తెలిసినా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని పోలీసులు ప్రజలను కోరుతున్నారు.

## వినాయక్ నగర్ బస్తి ఎన్నికల్లో సీ. హరి కిషోర్ గౌడ్ ఘన విజయం



**జూబ్లీహిల్స్ : మే 17 (పీపుల్స్ న్యూస్):** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎస్‌పీఆర్ హిల్స్ పరిధిలోని వినాయక్ నగర్ బస్తి ఎన్నికలు ఉత్కంఠభరితంగా ముగిశాయి. మొత్తం 888 ఓటర్లలో 733 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో ఎన్నికలపై ప్రజల్లో విశేష ఆసక్తి కనిపించింది. అనంతరం జరిగిన ఓట్ల లెక్కింపులో సీ. హరి కిషోర్ గౌడ్ ఘన విజయం సాధించారు. పోటీలో ఉన్న అభ్యర్థుల్లో కేశవులు 265 ఓట్లు, మాణిక్యం 40 ఓట్లు సాధించగా, సీ. హరి కిషోర్ గౌడ్ 422 ఓట్లు సాధించి తన సమీప ప్రత్యర్థిపై 157 ఓట్ల మెజారిటీతో విజేతగా నిలిచారు. అలాగే 6 చెల్లని ఓట్లు నమోదయ్యాయి. ఫలితాలు వెలువడగానే విజేత హరి కిషోర్ గౌడ్ అనుచరులు భారీగా సంబరాలు నిర్వహించారు. బాణాసంచా కాలుస్తూ, మిఠాయిలు పంచుకుంటూ ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన హరి కిషోర్ గౌడ్, బస్తి ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ప్రజాసేవకు ప్రాధాన్యత ఇస్తూ వినాయక్ నగర్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.ప్రశాంత వాతావరణంలో ముగిసిన ఈ ఎన్నికల ఫలితాలతో స్థానికులు ఆసక్తిగా ఎదురుచూసిన ఉత్కంఠకు తెరపడింది. ఇప్పుడు వినాయక్ నగర్ బస్తి అభివృద్ధిపై కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

## హైదరాబాద్ వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు

**474 మందిపై కేసులు నమోదు.**

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 17 (పీపుల్స్ న్యూస్) :** రోడ్డు భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నగరవ్యాప్తంగా రెండు రోజుల పాటు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 15, 16 వ తేదీలలో చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ మొత్తం 474 మంది డ్రైవర్లు పట్టుబడ్డారని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డి. జోయల్ డేవిస్ ఒక ప్రకటనలో తెలిపారు.మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో 417 మంది ద్విచక్ర వాహనదారులు (టూ వీలర్స్),24 మంది త్రీ-వీలర్ల నిర్వాహకులు, 33 మంది ఫోర్-వీలర్లు , ఇతర వాహనాల డ్రైవర్లు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. 30 - 50 బ్రీత్ అనలైజర్ స్థాయిలో 103 కేసులు, 51 - 100 బ్రీత్ అనలైజర్ స్థాయిలో 188 కేసులు, 101 - 150 బ్రీత్ అనలైజర్ స్థాయిలో 100 కేసులు, 151 - 200 బ్రీత్ అనలైజర్ స్థాయిలో 44 కేసులు, 201 - 250 బ్రీత్ అనలైజర్ స్థాయిలో 19 కేసులు, 251 - 300 బ్రీత్ అనలైజర్ స్థాయిలో 08 కేసులు, 300 అంతకంటే ఎక్కువ బ్రీత్ అనలైజర్ స్థాయిలో 12 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పట్ల , ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారి విషయంలో ఎలాంటి ఉపేక్ష (జీరో టాలరెన్స్) ఉండేది లేదని స్పష్టం చేశారు.
రోడ్డు ప్రమాదాల నివారణకు ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, వాహనదారులు, నగర ప్రజలు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సీపీఐ జిల్లా నాయకులు



**వనపర్తి, మే 17 (పీపుల్స్ న్యూస్) :** కొత్త చెరువు వెనక ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం సిపిఐ జిల్లా నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం దగ్గర రైతుల దగ్గరికి వెళ్ళి ఉన్నటువంటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచినీళ్ల సౌకర్యం రైతులు ఎండ కు కూర్చోవడానికి నీడకు టెంట్లు అలాగే కాంట చేసినటువంటి వడ్ల బ్యాగులను లారీలు రావడంలేదని అక్కడ కొనుగోలు కేంద్రం దగ్గర రైతులు ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే ప్రభుత్వం లారీలను పంపించి తూకం చేసినటువంటి వడ్లను వెంటనే తరలించాలన్నారు. మంచినీటి వసతి కూర్చోవడానికి ఎండకు నీడ టెంట్లు ఏర్పాటు చేయాలి లేనియెడల రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు తేతూరి శ్రీరామ్ , వనపర్తి టౌన్ సెక్రటరీ రమేష్, జిల్లా ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి వంక గోపాల్, కళాకారులు చందు మైబుసు మండల కార్యదర్శి ఎం కురుమయ్య వేమన్న డి శివ తదితరులు పాల్గొన్నారు.

# జూలై 11, 12 ఏఐటీయూసీ మహాసభలను జయప్రదం చేయాలి

**-- కార్మికుల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుంటాం : జిల్లా కార్యదర్శి శ్రీనివాస్**




**బాలానగర్ మే18 ( పీపుల్స్ న్యూస్):**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ కూకట్ పల్లి మండలం బాలానగర్ డివిజన్ పరిధిలోని శ్రీశ్రీ నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ఘనంగా నిర్వహించారు. రానున్న జూలై 11,12 తేదీలలో జరిగే ఏఐటీయూసీ మహాసభలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. సమావేశానికి హాజరైన ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక వర్గ హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ ఎల్లప్పుడూ పోరాట పథంలోనే ఉంటుందని స్పష్టం చేశారు. భవన నిర్మాణ రంగం, ఆటో రంగం సహా అన్ని రంగాల కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో సంఘం ముందుండిఉద్యమాలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం మరింత బలమైన పోరాటాలు అవసరమని, అందుకోసం మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా బాధ్యులు కామ్రేడ్ హరినాథ్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ కార్డులు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మిక కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. సీపీఐ కూకట్ పల్లి మండల కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు కార్మిక వర్గం వెన్నెముకలాంటిదని అన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ ఎన్నో ఉద్యమాలు నిర్వహించిందని, రానున్న రోజుల్లో కూడా కార్మిక సంక్షేమం కోసం పోరాటాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ సమావేశానికి మనోహారి అధ్యక్షత వహించగా, కార్యదర్శులు దావీద్, రాములు, ఉమాదేవి, హనుమంతు, గంగన్న, శ్రీనివాస్, రాజు గౌడ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

## దిల్‌కుష్‌నగర్‌లో ప్రజా సమస్యలపై బండి రమేష్ పాదయాత్ర

**-- ఫెన్సింగ్ తొలగించి రహదారి పునరుద్ధరణ చేయాలి కాలనీవాసుల వినతి**
**-- డ్రైనేజీ సమస్యలు, రాత్రి పోలీస్ గస్తీపై సంబంధిత అధికారులతో చర్చిస్తా...**



**బాలానగర్ మే18 ( పీపుల్స్ న్యూస్):**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ దిల్‌కుష్‌నగర్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టిపిసిసి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ఆదివారం బాలానగర్ డివిజన్ పరిధిలోని దిల్‌కుష్‌నగర్ కాలనీలో విస్తృత పాదయాత్ర నిర్వహించారు. స్థానిక ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ మేరకు పాదయాత్ర సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యలను బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా గతంలో ఐడీపీఎల్ స్థలం రహదారి ద్వారా రాకపోకలు సాగించేవారమని, ప్రస్తుతం ఇటీవల ఆ మార్గానికి అడ్డంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. వెంటనే ఫెన్సింగ్ తొలగించి రహదారిని పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేశారు. అలాగే కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని, మురుగు నీరు రోడ్లపై పొంగిపొర్లుతూ తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. నూతన డ్రైనేజీ వ్యవస్థను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా రాత్రివేళల్లో పోలీస్ నైట్ ప్యాట్రోలింగ్ లేకపోవడంతో అసాంఘిక శక్తుల సంచారం పెరిగిపోయిందని, ఈ విషయమై కాలనీ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. కాలనీలో క్రమం తప్పకుండా పోలీస్ గస్తీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న బండి రమేష్ స్పందిస్తూ, రహదారి, డ్రైనేజీ, భద్రత సమస్యలపై త్వరలోనే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పా రెడ్డి, పులి శివకుమార్ గౌడ్, శ్రీకాంత్ పటేల్, మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, ప్రసన్న కుమార్, నరేందర్, బాల నరసింహ, సదానందం, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

# ఫతేనగర్ 260 డివిజన్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సర్ ప్రీ-రివిజన్ కార్యక్రమం

**-- బూత్ లెవల్ ఏజెంట్స్‌తో ఎన్నికల నమోదు ప్రక్రియపై అవగాహన -- ఓటరు జాబితా సవరణలపై విస్తృత చర్చ**



**బాలానగర్ మే18 ( పీపుల్స్ న్యూస్):**మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ ఫతేనగర్ 260 డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఏజెంట్స్ బీఎల్ ఎస్ తో కలిసి సర్ ప్రీ-రివిజన్ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణలు, పేర్ల చేర్పులు మరియు తొలగింపులపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మేడ్చల్ డీసీసీ కార్యదర్శి కె. వినయ్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్య బాధ్యత అని పేర్కొన్నారు. బూత్ స్థాయిలో పనిచేసే బీఎల్‌ఏలు ప్రజలకు సరైన సమాచారం అందించి, ఎవరూ ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డివిజన్ అధ్యక్షుడు కె. రమేష్ ముదిరాజ్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం ఎంతో ముఖ్యమని అన్నారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా నిరంతరం పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరాలస్వామి, యువ కాంగ్రెస్ నాయకులు రాజు, అరుణ్, కృష్ణ తదితరులు పాల్గొని ఓటరు నమోదు ప్రక్రియపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. యువత ముందుకు వచ్చి ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేరు సవరణలు, ఓటరు జాబితాలో ఉన్న లోపాలను గుర్తించి సరిదిద్దే విధానాలపై బీఎల్‌ఏలకు ప్రత్యేక మార్గదర్శకాలు అందించారు. ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వ్యవస్థ పట్ల తమ బాధ్యతను చాటుతూ, ప్రజల ఓటు హక్కు పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తున్నట్లు స్పష్టం చేసింది.

## వీకెండ్--స్పెషల్ డ్రంక్ & డ్రైవ్ లో 300 మందిపై కేసులు








**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 17 (పీపుల్స్ న్యూస్):** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ ఎడీసీపీ ట్రాఫిక్ I, జి హన్మంతరావుతెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా 300 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. 253 ద్విచక్ర వాహనదారులు,09 ఆటోలు,38 కార్లు, 00 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే 232 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, 35 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,33 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత --2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది. గత వారం (ఈ నెల 11 నుంచి 16 వ తేది లోపు మొత్తం 96 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.వీరిలో 07 మందికి జరిమానా, జైలు శిక్ష,02 మందికి జరిమానా, సోషల్ సర్వీస్,87 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

**సిపిఐ జిల్లా నాయకులు**



**వనపర్తి ,మే 17( పీపుల్స్ న్యూస్) :** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. బొల్లారం గ్రామంలో సిపిఐ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ డీజిల్ ధరల పైన గాంధీనగర్ లో సిపిఐ జెండా దగ్గర నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలన్నారు. ఈ పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడం వలన సామాన్యుల పైన నిత్యవరవ నిత్యవసర వస్తువులు వాహన చార్జీలు వివిధ రకాలైనటువంటి భారాలు సామాన్య ప్రజల పైన పడుతాయని పేర్కొన్నారు. పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని, లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు ప్రజలను సమీకరించి పెట్రోల్ డీజిల్ ధరలపైన తగ్గించే వరకు పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం , రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు భరోసా మూడవ విడత నిధులను వెంటనే పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు శ్రీరామ్, రమేష్, గోపాల్, కుర్మయ్య, మై బూస్, కాకం కాశన్న, కాకం రాముడు, తదితరులు పాల్గొన్నారు.

# పొదుపు మంత్రం ఆవశ్యకత ఇప్పుడు తెలిసిందా?

**– పాలకులు ఎవరైతేనేమి? ఇప్పటికైనా వేతనాలు, ఖర్చుల్లో కోత విధించుకొని చిత్తశుద్ధిని చాటుకోవాలి!**



నూటికో కోటికో ఒకరోజు పేదవాడు వాంతులు చేసుకుంటే.. "అత్యాశతో అంత దిగమింగుడు అవసరమా?" అని కొందరు ఎద్దేవా చేస్తారు. పేదలు, అల్పాదాయ వర్గాలు తమ నిజజీవిత అవసరాలను తీర్చుకోలేని పరిస్థితుల్లో ప్రభుత్వాలు సబ్సిడీలు ఇచ్చినప్పుడు లేదా ఉచిత హామీలతో ఆర్థిక పరిస్థితిని చక్కబెట్టే ప్రయత్నం చేసినప్పుడు.. "పేదలకు ఈ ఉచితాలు అవసరమా?" అని కూడా ప్రశ్నిస్తూ ఉంటారు.

కానీ, ఈ దేశంలో బడా పెట్టుబడిదారీ వర్గాలు ప్రభుత్వ బ్యాంకులకు ఎగ్గొట్టిన రుణాలను తీర్చే క్రమంలో, లక్షల కోట్ల రూపాయలను ప్రభుత్వం 'కార్పొరేట్ మాఫీ' చేసిన తీరును గమనిస్తే.. ఎవరు తిండిపోతులో, ఎవరు పేదవర్గాలో, ఆకలితో అలమటించేది ఎవరో సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికీ ఆకలి కేకలు ఒకచోట ఉంటే, అన్నపురాశులు మరొకచోట దర్శనమిస్తూనే ఉన్నాయి. ఇంత అసమానతలతో కూడుకున్న భారతదేశంలో రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, సంపన్న వర్గాలు, పారిశ్రామికవేత్తలు ప్రజాధనాన్ని తమ సొంత సంపదగా భావిస్తూ విచ్చలవిడిగా ఖర్చు చేస్తూనే ఉన్నారు. పేదలు మాత్రం తమ చెమట చుక్కల ఫలితాన్ని కనీసంగా కూడా అనుభవించడానికి అర్హత కోల్పోతున్నారు. ఇది భారతదేశంలోని విచిత్ర వైరుధ్యాలకు తార్కాణం. ఆర్థిక సంస్కరణలు – ప్రైవేటీకరణ దుస్థితిభారతదేశం 1991లోనే ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. అయితే ఆ పరిస్థితులు ఒకనాటితో ఉద్భవించినవి కావు. ప్రభు త్వాల బాధ్యతారాహిత్యం, తప్పటడుగులు, స్వప్రయో జనాలు, కుంభకోణాల ఫలితంగా ఏర్పడిన దుస్థితి అది. ఆనాటి నుండి అమలు చేసిన అనేక ఆర్థిక సంస్కరణల కారణంగా కొంతవరకు పరిస్థితి చక్కబడినా, క్రమక్రమంగా దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలు మాత్రం ప్రైవేటుపరమయ్యాయి అనడంలో సందేహం లేదు. గత పది సంవత్సరాలలో మరింత వేగంగా ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటుపరం కావడాన్ని మనం గమనించవచ్చు.

అంటే, పాలకులు ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ తమ బాధ్యత నుండి తప్పుకుంటూ, ప్రజల సొమ్మును మాత్రం విచ్చలవిడిగా ఖర్చు చేసేటటువంటి ఒక దుస్సంప్రదాయం క్రమంగా వేళ్లూనుకుంది. దీని ఫలితంగానే నేడు పాలకులకు 'పొదుపు మంత్రాన్ని' జపించవలసిన పరిస్థితి వచ్చింది.

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రారంభించి, వాటిని పెంచి పోషించిన పరిపాలన సరళి.. గత పదేళ్లలో తిరోగమనంలో పడి భారీగా క్షీణించడాన్ని సామాజిక విశ్లేషకులు, రాజకీయ నిపుణులు తప్పుపడుతున్నారు. దీనివల్ల ప్రభుత్వ రంగ సంస్థల్లో పేదలు, మధ్యతరగతి, అట్టడుగు వర్గాలకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయి. రిజర్వేషన్ల ఫలాలు వర్తించకపోవడం వల్ల అవకాశాలన్నీ మళ్లీ సంపన్న వర్గాలకే దక్కుతున్నాయి. ఇంత విచిత్రమైన పరిస్థితుల మధ్య దేశం ఆర్థిక సంక్షోభంలోకి క్రమంగా వెళ్తూ ఉంటే, భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తోందని ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకోవడం ఏ రకంగా సబబు? అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు సాధారణ స్థాయిలో ఉన్నప్పటికీ, మన దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచిన సందర్భాన్ని గతంలో మేధావులు ఎన్నోసార్లు ప్రశ్నించారు. ఇటీవల పశ్చిమాసియాలో సంభవించిన యుద్ధ వాతావరణం కారణంగా ధరలు పెరుగుతున్నాయని, అనివార్య పరిస్థితిలో పెంచక తప్పలేదని ప్రభుత్వాలు చెప్పడం అవకాశాలను సొమ్ము చేసుకోవడమే అవుతుంది.

పొదుపు సర్వత్రా అవసరమే.. అది పాలకుల నుంచే మొదలవ్వాలి! ప్రజల కష్టార్జితాన్ని తమ విలాసాలు, ఆడంబరాలకు ఖర్చు చేస్తున్న పాలకులు.. ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయిన తర్వాత ఇప్పుడు పొదుపు మంత్రాన్ని బోధించడం ఏ మేరకు సమంజసం? ప్రస్తుతం ఉన్న గడ్డు పరిస్థితులు గతంలో లేవా? విలాసాలు, ఆడంబరాలతో పాటు మంత్రులు, అధికారుల ప్రయాణ ఖర్చులు, వేతనాలు, ఇతర సౌకర్యాలకు భారీగా ప్రభుత్వ నిధులను ఖర్చు చేసిన విషయం నిజం కాదా?

చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వాలు, మంత్రులు, ప్రధాని, ముఖ్యమంత్రులతో సహా అందరూ కూడా తమ వేతనాలలో భారీ కోతను విధించుకోవడం ద్వారా తమ చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాలి. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంత్రులు తమ వేతనంలో సగానికి సగం కోత విధించుకుంటామని, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో సహకరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అది ఒక్క నెలతోనే సరిపోదు. అవసరమైతే పరిస్థితులు చక్కబడే వరకు నిరంతరం ఆ సూత్రం పాటిస్తే తప్పేమీ లేదు. అప్పుడు తెలంగాణ దేశానికే ఆదర్శం అవుతుంది.

ఇక ప్రధానమంత్రి గారు.. బంగారం రేటు భారీగా పెరిగినందున సామాన్య ప్రజలు కొనుగోలు చేయకుండా అవసరాలను తగ్గించుకుంటే ఆర్థిక పరిస్థితికి ఊతమిచ్చినట్లు అవుతుందని చేసిన సూచన విడ్డూరంగా ఉంది. ఇది ఉన్నత వర్గాలకు ఏ రకంగానూ ఇబ్బంది కలిగించదు. కానీ పేద, మధ్యతరగతి వర్గాల వారు కనీస అవసరాల (పెళ్లిళ్లు వంటి శుభకార్యాల) కోసం కొనుగోలు చేయక తప్పని పరిస్థితులలో, కావాలని ప్రభుత్వమే రేట్లను పెంచి నష్టపరిచినట్లు కాదా? దిగుమతి సుంకాన్ని భారీగా పెంచడం ద్వారా బంగారానికి వేల రూపాయల అదనపు ధర పెరిగిన సందర్భాన్ని గమనిస్తే, ఇది ఏ వర్గ ప్రయోజనం కోసం చేసిన చర్యనో అర్థమవుతుంది.

నిజమైన ప్రజా నాయకునికి ఏ రక్షణ ఆడంబరాలు అవసరం లేదు. కాన్వాయ్ల పేరుతో మంత్రులకు, శాసనసభ్యులకు భారీ మొత్తంలో వాహనాలను సమకూర్చి, పెట్రోల్ డీజిల్ వాడకాన్ని ముమ్మరం చేసి, ఆర్థిక భారాన్ని ప్రజల మీద మోపుతున్న తీరు అందరికీ వర్తిస్తుంది. ఇతర రాష్ట్రాల, దేశాల పర్యటనలు చేస్తున్న సందర్భంలో కోట్ల రూపాయలు ప్రజాధనం ఖర్చవుతూనే ఉంది. ఇక సభలు, సమావేశాలు, అధికారిక కార్యక్రమాల ఆడంబరాల కోసం వెచ్చిస్తున్న ఖర్చులకు అంతే లేదు.

"మింగ మెతుకు లేదు కానీ.. మీసాలకు సంపెంగ నూనె" అన్నట్టుగా ఉంది నేటి పరిస్థితి.

పేద విద్యార్థులకు కనీసం నాణ్యమైన భోజనం ఇవ్వలేనటువంటి పరిస్థితులలో విలాసాలకు మాత్రం నిధుల కొరత లేకపోవడాన్ని మనం దేశవ్యాప్తంగా గమనించవచ్చు. పేద వర్గాలకు విద్యా, వైద్యం కూడా అందని ద్రాక్షగా మిగిలింది. ప్రైవేట్ రంగంలో చికిత్సలు చేయించుకోవడం, చదువులు చదువుకోవడం వల్ల పేద కుటుంబాల పైన అంతులేని భారం పడి, పేదలు మరీ పేదలుగా మారుతుంటే ప్రభుత్వాలు ఏనాడైనా ఆలోచించాయా? అంతర్జాతీయ సంక్షోభాలను పరోక్షంగా ప్రస్తావిస్తూ ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కడానికి పొదుపే మార్గమని ప్రధాని ప్రకటించగానే అందరూ తలూపడం వెనుక అర్థం ఏమిటి? యుద్ధంతో సంబంధం లేకుండా, అంతకుముందు ఖర్చులను విచ్చలవిడిగా చేసి ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసినప్పుడు ఈ పొదుపు మంత్రం జ్ఞాపకం రాలేదా? పాలనా వ్యవస్థ నిర్వహణకు హెచ్చు ఖర్చులు కావడం వల్ల.. మౌలికమైన విద్యా, వైద్యం, గృహవసతి, తాగునీరు, నాణ్యమైన రోడ్లకు నిధులు లేకపోవడం ఒకవైపైతే.. ప్రభుత్వం నిర్మించిన రోడ్లపై వెళ్తున్న వాహనదారుల నుండి 'టోల్ టాక్స్' రూపంలో కోట్లాది రూపాయలను దశాబ్దాల పాటు వసూలు చేయడంలో ఉన్న ఆంతర్యం ఏమిటి? ప్రజల పన్నులతో రోడ్లను నిర్మించి, మళ్లీ ప్రైవేటు వారికి వసూళ్ల బాధ్యత అప్పగించడం సామాన్య దృష్టిలో విచిత్రంగా ఉంది కదూ!

ప్రజాప్రతినిధులు సేవకులా? జీతగాళ్లా?

ఒక మంత్రి వెళ్తూ ఉంటే పదుల కొద్దీ కార్ల కాన్వాయ్, ఒక ముఖ్యమంత్రి ఢిల్లీకి సంవత్సరంలో డజన్ల కొద్దీ ప్రయాణాలు, పార్లమెంటు, అసెంబ్లీ సభ్యుల వేతనాలతో పాటు వారికి కల్పిస్తున్న సౌకర్యాలు, రాజభోగాలకు అంతే లేదు. కనీసం ఈ సందర్భంలోనైనా ఇళ్లు లేక రోడ్ల మీద బతుకుతున్న పేదల దుస్థితిని అర్థం చేసుకునే మనసు పాలకులకు ఉందా?

గమ్మత్తు ఏమిటంటే.. ప్రజాప్రతినిధి బాధ్యత అనేది వేతనంతో కూడుకున్న ఉద్యోగం కాదు, అది కేవలం సేవారంగానికి సంబంధించిన అంశం. అలాంటప్పుడు ప్రభుత్వ ఉద్యోగులలాగా వీరికి పెన్షన్ సౌకర్యం ఉండడం నేరమని ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్నది. ఈ చర్చ విస్తృతం కాకముందే, విషయం న్యాయస్థానాల వరకు వెళ్లకుండానే ప్రభుత్వాలు పునరాలోచించి, ప్రజాప్రతినిధుల పెన్షన్ సౌకర్యాన్ని ఉపసంహరించుకుంటే మంచిదని సామాజిక, రాజకీయవేత్తలు హెచ్చరిస్తున్నారు. అలాగే ఎన్ని పదవులు చేస్తే అన్ని రకాల పెన్షన్లకు అర్హులని చెప్పడం మరింత మూర్ఖత్వం అవుతుంది.

"అందిన కాడికి దోచుకోవడం" అనే సామెత లాగా.. ఈ దేశ సంపదను చేతనైనవాడు, సమర్థుడు, మోసగాడు, పెట్టుబడిదారుడు, మాటకారి ఎంతైనా దోచుకోవచ్చుననే దానికి ఎన్నో ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. నిజాయితీ గల పాలకులు ఈ అసమానత్వాలను అంతం చేయాలి. ప్రభుత్వ పెద్దలు తాము కేవలం ప్రజా సంపదకు కాపలాదారులు మాత్రమేనని భావించి, తమ విలాసాలను కుదించుకోవాలి. కనీసం ఒక్క వాహనానికే పరిమితం చేసుకునే విజ్ఞతను అలవాటు చేసుకుంటే కోటానుకోట్ల రూపాయల ప్రజాధనాన్ని పొదుపు చేయవచ్చు. ఆ డబ్బుతో ఎంతోమంది పేదలకు సకల సౌకర్యాలు కల్పించవచ్చు. ఇది ఏదో ఒక్క రోజుతో ముగిసిపోయే ఆలోచన కాకూడదు, నిరంతరం కొనసాగే ప్రక్రియగా అమలు కావాలి.

వడ్డేపల్లి మల్లేశం (సామాజిక రాజకీయ విశ్లేషకుడు, అరసం రాష్ట్ర కమిటీ సభ్యుడు, హుస్నాబాద్, సిద్దిపేట జిల్లా, తెలంగాణ)

# తాగునీటి సమస్య తీర్చిన ఆధార్ పార్టీ అధ్యక్షుడు కంటే కేశవ గౌడ్..బీజేపీ నాయకులు తంబళ్ల రవి

**– కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు..**




**దమ్మపేట, మే 17:** అశ్వరావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలంలోని మందల పల్లి గ్రామంలో తాగునీటి కోసం గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా తాగునీరు లేక ప్రజలు అల్లాడుతున్నారు. గ్రామస్తులు ద్వారా ఈ విషయం తెలుసుకున్న ఆధార్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కంటే కేశవ గౌడ్ స్పందించి తక్షణమే ఆ గ్రామానికి వాటర్ ట్యాంకు ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. అర్ధరాత్రి గ్రామస్తులు ఆయనకు సమాచారం అందించడంతో హుటా హుటీనా ట్యాంకర్ ద్వారా తాగునీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవికాలం నేపథ్యంలో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి తాగునీటి ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా వేసవికాలంలో ప్రధానంగా తాగునీటి సమస్య ఉంటుందని వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆధార్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# 6 గంటల కంటే తక్కువ నిద్రపోతున్నారా? హై బీపీతో ఇక డేంజరే..



మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే నిద్ర చాలా అవసరం. నిద్రపోవటం వల్ల శరీరానికి విశ్రాంతి లభిస్తుంది. శారీరకంగానూ.. మానసికంగా నిద్ర చాలా అవసరం. ప్రతీ రోజూ 6 గంటలకంటే తక్కువ నిద్రపోతే ఆరోగ్యం దెబ్బ తినే అవకాశం ఉంది.

నిద్రలేమి కారణంగా హైపర్ టెన్షన్ మరింత పెరుగుతుంది. మనదేశంలో సుమారు 22 కోట్ల మంది హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నారు. హైపర్ టెన్షన్ కారణంగా చాలా మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

నిద్రలేకపోతే ఏం జరుగుతుంది..సాధారణంగా మనం నిద్రపోతున్నపుడు హార్ట్ రేట్, బ్లడ్ ప్రెషర్ 10 నుంచి 20 శాతం తగ్గుతాయి. తద్వారా గుండె, రక్త నాళాలు విశ్రాంతి పొంది, రికవర్ అవుతాయి. రోజుకు 6 కంటే తక్కువ గంటలు నిద్రపోయే వారిలో హైపర్ టెన్షన్ 20 నుంచి 32 శాతం అధికంగా వచ్చే అవకాశం ఉందని పరిశోధనల్లో తేలింది. కార్టిసాల్, అడ్రినలిన్ వంటి హార్మోన్ల ఉత్పత్తి పెరగటం వల్ల హార్ట్ రేట్ పెరుగుతుంది. రక్త నాళాలు కుంచించుకుపోతాయి. అంతేకాదు.. తగినంత నిద్రపోలేకపోతే ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరుగుతుంది. ఇన్‌ఫ్లమేషన్ వచ్చే అవకాశం ఉంది.

హైపర్ టెన్షన్ నుంచి రక్షణ పొందండిలా..హైపర్ టెన్షన్ సమస్య ఉన్నవారిలో సగం మందికి అసలు తమకీ సమస్య ఉందనే తెలియదు. 12.5 శాతం నుంచి 15 శాతం మంది మాత్రమే సరైన చికిత్స తీసుకుంటున్నారు. హైపర్ టెన్షన్ బారినపడకుండా ఉండాలన్నా.. వచ్చిన తర్వాత బీపీని కంట్రోల్‌లో ఉంచాలన్నా 7 నుంచి 9 గంటలు మంచి నిద్ర ఉండాల్సిందే. మగత నిద్ర వల్ల శరీరానికి ఎలాంటి లాభం ఉండదు. ప్రతీ రోజూ ఒకే సమయానికి నిద్రపోవాలి. ఒకే సమయానికి లేవాలి. నిద్రలేమి, గురక ఇతర సమస్యలపై తప్పకుండా దృష్టిపెట్టాలి. నిద్రపోయే ముందు సెల్ ఫోన్ అస్సలు వాడకూడదు.

# శ్రీకాకుళం గాంధీ మందిరంలో చంద్రశేఖర్ ఆజాద్ విగ్రహావిష్కరణ

- భారతమాత దాస్యవిముక్తికై అశువులు బాసి వీరమరణం పొందిన స్వాతంత్ర్య సమరయోధుడు ఆజాద్
- గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి 'రఘుపతి రాఘవ రాజారాం' గీతాలాపన



**శ్రీకాకుళం:** గాంధీ మందిరంలోని స్వాతంత్ర్య సమరయోధుల, సంఘ సంస్కర్తల తేజోమూర్తుల స్మృతి వనంలో పైడి అమ్మడు, తులసమ్మల జ్ఞాపకార్థం ప్రముఖ అవధాన పం డితులు విద్వాన్ పైడి హరనాథ రావు – లక్ష్మి, పైడి రామ చంద్రరావు – విశ్వేశ్వరి మరియు కుటుంబ సభ్యులు స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ విగ్రహాన్ని నెలకొల్పారు. ఈ విగ్రహాన్ని ఆదివారం ఉదయం వారి కుటుంబ సభ్యులు కర్నల్ అల్లు మురళి, రోణంకి రవి నాగేశ్వరరావులు ఆవిష్కరించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. జలియన్ వాలా బాగ్ సంఘటనలో అమాయకులైన భారతీయులను మూకుమ్మడిగా కాల్చి చంపడం, నిరసన తెలుపుతున్న లాలా లజపతి రాయ్‌పై లాఠీ ఝులిపించి ఆయన మరణానికి కారణం కావడం వంటి రెండు ఘోరమైన సంఘటనలు భారతీయ యువతను తీవ్రంగా కలచివేసాయన్నారు. వీటికి కారణమైన బ్రిటిష్ అధికారులు, పోలీసులను తుదముట్టించాలనే భావన, తదనంతర పరిణామాలు ఆజాద్ విప్లవ పంథాలో సాగడానికి పునాది వేశాయని పేర్కొన్నారు. బ్రిటిష్ వారికి చిక్కడం, వారి చేతిలో మరణించడం కంటే ఆత్మార్పణే మిన్న అని భావించిన 24 ఏండ్ల చంద్రశేఖర్ ఆజాద్, తన తుపాకీలోని చివరి తూటాను తలకు గురిచేసుకొని వీరమరణం పొందారని కొనియాడారు. దేశభక్తి, స్వాతంత్ర్య కాంక్ష, త్యాగం, వీరోచిత పోరాటం వంటి అంశాలలో చంద్రశేఖర్ ఆజాద్ నేటి తరానికి స్ఫూర్తిప్రదాతగా నిలుస్తారని, యువత ఆజాద్ లాంటి దేశభక్తులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం వారు గాంధీ మందిరంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి, 'రఘుపతి రాఘవ రాజారాం' గీతాన్ని సామూహికంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో డా. నిక్కు అప్పన్న, బరాటం లక్ష్మణరావు, ఎమ్.వి.ఎస్.ఎస్. శాస్త్రి, నిష్టల నరసింహ మూర్తి, చౌధరి రాధాకృష్ణ, నక్క శంకర రావు, జి. నాగేశ్వరరావు, జగ్గమ్మ, గుత్తు చిన్నారావు, పి. అప్పారావు, జయలక్ష్మి, రఘుపాత్రుని వెంకట రమణమూర్తి, మహిబుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో సోయాబీన్స్ ఆరోగ్య ప్రయోజనాలు.. తెలిస్తే అస్సలు వదలరు



వేసవిలో శరీరాన్ని చల్లబరిచే, శక్తినిచ్చే ఆహార పదార్థాలను తీసుకోవడం చాలా ముఖ్యం. ఈ కాలంలో సోయాబీన్స్ తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ఇందులో ప్రొటీన్లు, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. రుచిగా లేకపోవడం, వగరుగా ఉండే సోయాబీన్స్‌ను తినడానికి చాలా మంది ఇష్టపడరు. అయితే మాంసాహారంతో సమానమైన పోషకాలు సోయా బీన్స్‌లో ఉంటాయి. ముఖ్యంగా గుండె ఆరోగ్యం ముఖ్యపాత్ర పోషిస్తాయి.

# పదోతరగతి బాలికలకు డా.యడ్ల నీరజారాణి ప్రతిభా పురస్కారాలు






**విజయనగరం:** రాజాంతో పాటు పరిసరాల్లోని పది మండలాలకు చెందిన పదవ తరగతి బాలికలకు 'డా.యడ్ల నీరజారాణి గర్ల్స్ ఎస్ఎస్సి 2026' పురస్కారాలను ప్రదానం చేసినట్లు ప్రముఖ స్త్రీ మరియు ప్రసూతి వైద్యనిపుణురాలు, లాపరోస్కోపిక్ సర్జన్ డా.యడ్ల నీరజారాణి తెలిపారు. ఇటీవల ప్రకటించిన పదోతరగతి ఫలితాల్లో 550 మార్కులకు పైబడి సాధించిన ప్రభుత్వ పాఠశాలల బాలికలను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు.

డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో, ప్రధానోపాధ్యాయులు ఆర్.వి.జి.ఎ.ఎన్. మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ రంగస్థల కళాకారులు, పద్మశ్రీ పురస్కార గ్రహీత యడ్ల గోపాలరావు విచ్చేశారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ బడి విద్యార్థినుల అభ్యున్నతి ధ్యేయంగా ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని, ఇదొక మహా సంకల్పమని కొనియాడారు. గత ఎనిమిదేళ్లుగా ఈ ప్రతిభా పోటీలను ఆదరశ్రవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పురస్కారాలు బాలికా విద్య మెరుగుదలకు నాంది పలుకుతాయని, ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు తల్లిదండ్రుల్లో ఉత్సాహాన్ని నింపుతాయని ఆయన పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సామంతుల సింహాద్రినాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించి, వారిలోని సృజనాత్మకతను వెలికితీసేలా పాటుపడే ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు ఎల్లప్పుడూ సహకరించాలని కోరారు.

140 మందితో ప్రతిభా పరీక్ష:

స్వర్గీయ మజ్జి దుర్గమ్మ ఆశయ సాధనలో భాగంగా రాజాం, రేగిడి ఆమదాలవలస, సంతకవిటి, వంగర, జి.సిగడాం, తెర్లాం, పాలకొండ, బూర్జ, మెరకముడిదాం, బలిజిపేట మండలాలకు చెందిన 140 మంది బాలికలకు పురస్కార కమిటీ సభ్యులు తొలుత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష పత్రంలో గణితానికి 20 మార్కులు, ఫిజిక్స్‌కు 10 మార్కులు, కెమిస్ట్రీకి 10 మార్కులు, బయాలజీకి 10 మార్కులు చొప్పున మొత్తం 50 మార్కులను కేటాయించారు.

పరీక్షల పర్యవేక్షకులుగా నిర్వాహక కమిటీ అధ్యక్షులు సామంతుల సింహాద్రినాయుడు, కార్యదర్శి డా.యడ్ల నీరజారాణి వ్యవహరించారు. కార్యవర్గ సభ్యులుగా రాజాం కేర్ హాస్పిటల్ వైద్యులు డా.సామంతుల కిరణ్ కుమార్, సురక్ష హాస్పిటల్ వైద్యులు డా.సామంతుల శరత్ కుమార్, డా.సవిరిగాన సురేష్ కుమార్, డా.ప్రతిమ, డా.ఎం.సౌజన్య, పీజీ డాక్టర్లు అంజు అలెక్స్, బద్రి, సుమ, దివ్య, డోలపేట జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు ఈసర్ల మురళీకృష్ణలు బాధ్యతలు నిర్వహించారు.

విజేతల వివరాలు: ప్రథమ స్థానం: వాల్తేరు పాఠశాల విద్యార్థిని ఎస్.ఐశ్వర్య (రూ. 25,000 నగదు, శాలువా, జ్ఞాపిక)

ద్వితీయ స్థానం: జి.సిగడాం పాఠశాల విద్యార్థిని టి.ధనలక్ష్మి (రూ. 15,000 నగదు, శాలువా, జ్ఞాపిక)

తృతీయ స్థానం: డోలపేట పాఠశాల విద్యార్థిని ఎల్.నీహారిక (రూ. 10,000 నగదు, శాలువా, జ్ఞాపిక)

రూ. 1,000 చొప్పున ప్రోత్సాహక బహుమతులు:

తదుపరి స్థానాల్లో నిలిచిన ఎల్.నందిని (ఓవిపేట), కె.నవ్యశ్రీ (పెరుమాళి), జి.నీహారిక (వాల్తేరు), డి.మనీషా (డోలపేట), పి.భువనశ్రీ (పాలకొండ), ఎం.చాందిని (రేగిడి), పి.రేణుక (రేగిడి)లకు వెయ్యి రూపాయల చొప్పున నగదు పురస్కారాలు అందించారు.

ప్రత్యేక పురస్కారాలు: డా.యడ్ల నీరజారాణి, మజ్జి దుర్గమ్మలు చదువుకున్న మందరాడ, పాలకొండ, డోలపేట ఉన్నత పాఠశాలల విద్యార్థినులు గొర్లె సాత్విక, ఆబోతుల దీపిక, బొత్స మనీషాలకు రూ. 5,000 చొప్పున ప్రత్యేక పురస్కారాలు అందజేశారు. అలాగే పది మండలాల్లో 590 కి పైగా మార్కులు సాధించిన గొర్లె సాత్విక, మంతిన విజయలక్ష్మి, పూ దుర్గాశిరీష, పెద్దింటి భువనశ్రీలకు రూ. 3,000 చొప్పున నగదు పారితోషికాలు అందించారు. పరీక్షకు హాజరైన 140 మంది బాలికలకూ ప్రోత్సాహక కానుకలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో పరీక్ష నిర్వాహకులు, విషయ నిపుణులు, ఉపాధ్యాయులు, వైద్యులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉరిటి రవిశంకర్, దాసరి హరిబాబు, ఎస్ఎంసీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, లావేటి గోవిందరావు, కడగల అనంతరావు, గుడ్ల భరత్ కుమార్, టంకాల హైమవతి, ఉరిటి వాసుదేవరావు, ఉగిరి మురళీకృష్ణ, కోడ పురుషోత్తం, మూడడ్ల శ్రీనివాసరావు, జి.వెంకటరమణ, అదపాక దామోదరరావు, జి.ఆదినారాయణ, రాష్ట్రపతి పురస్కార గ్రహీతలు కుదమ తిరుమలరావు, పెంకి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

